

జిల్లాలో 33 మంది వలంటీర్ల తొలగింపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వివిధ కారణాలతో చిత్తూరు జిల్లాలో 33 మంది వలంటీర్లు తొలగింపబడ్డారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వలంటీర్ల తొలగింపు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారంటూ చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 18 మంది వాలంటీర్లను తొలగిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పలమనేరు మున్సిపాలిటీలో 12 మంది, గుడిపాల మండల పరిధిలో ముగ్గురిని విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వలంటీర్ల తొలగింపులు రాజకీయ కారణాలున్నట్లు తెలుస్తోంది. సరైన కారణాలను చూపకుండా తమను తొలగించారంటూ వలంటీర్లు వాపోతున్నారు. ఎలాంటి ముందస్తు నోటీసులు, తొలగించడానికి గల కారణాలను తెలుపకుండా తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడం పట్ల వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షల వేళ ప్యాడ్లగోల

- ఎమ్మెల్యే పంపిణీ చేసిన ఫ్యాడ్ల పట్ల వివాదం
- ఎన్నికల కోడ్ ఉల్లంఘన



ఎమ్మెల్యే వెంకటే గౌడ పంపిణీ చేసిన ఫ్యాడ్లతో విద్యార్థులు

ప్రజాశక్తి- వికోట: మండలం పలమనేరు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే వెంకటే గౌడ అందజేసిన ప్యాడ్లతో హాజరైన విద్యార్థులను పరీక్షలకు అనుమతించే విషయంలో మండలంలో గందరగోళం నెలకొంది. ఎమ్మెల్యే వెంకటే గౌడ గత నాలుగేళ్లుగా నియోజకవర్గంలోని పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు విద్యాసామగ్రి, ఫ్యాడ్‌లను పంపిణీ చేస్తున్నారు. అలాగే ఈ సంవత్సరం కూడా విద్యార్థులకు ఫ్యాడ్‌లను 15 రోజుల క్రితమే పంపిణీ చేశారు. అయితే ఫ్యాడ్లపైన ఎమ్మెల్యే తన ఫోటోను ముద్రించి పంపిణీ చేశారు. ఈ ఫ్యాడ్లపై విద్యార్థులకు పరీక్షా కేంద్రాలకు రావడంతో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని పలువురు విమర్శించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో రాజకీయ పార్టీలకు సంబంధించిన సామగ్రి వినియోగించరాదని తెలిసినా సంబంధిత అధికారులు విద్యార్థులకు ముందుగా హెచ్చరిక చేయకపోవడం పట్ల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలిని విద్యార్థులు ఎమ్మెల్యే ఫొటోలున్న ఫ్యాడ్లతో పరీక్షలకు హాజరుకాగా ఇన్విజిలేటర్లు, పరీక్షల సిబ్బంది లోపలికి అనుమతి పోవడంతో కొంతమంది విద్యార్థులు ఫ్యాట్లను బయటపడేశారు. మీడియా ప్రతినిధులు పలమనేరు ఆర్‌డిఓకు ఫిర్యాదు చేయగా కచ్చితంగా ఇది కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందనీ, పలమనేరు నియోజకవర్గంలో ఏ పాఠశాల పరీక్ష కేంద్రంలోనికి ఇలాంటివి అనుమతించరాదని సంబంధిత ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

చర్యలు తీసుకుంటాం...

- చంద్రశేఖర్, వికోట ఎంఈవో



సమాచార లోపంతో ఈ సంఘటన జరగడం దురదృష్టకరం. ఇటువంటి పొరపాట్లు జరగకుండా తగిన చర్యలు తీసుకున్నాం. పరీక్షలు నిర్వహించే సమయానికి విషయం తెలిసి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారిని ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు మా వంతు కృషి చేశాం. పలమనేరు ఎమ్మెల్యే 15 రోజుల క్రితం ఈ ఫ్యాడ్లను పంపిణీ చేసిన విషయం నా దృష్టికి రాలేదు. సోమవారం పరీక్షలు జరిగే సమయానికి విషయం తెలుసుకొని అందుబాటులో ఉన్న విద్యార్థుల ఫ్యాడ్లను బయటపడవేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసాం. ఇకపై జరగనున్న పరీక్షలకు ఆ ఫ్యాడ్లను అనుమతించేది లేదని విద్యార్థులకు తెలిపారు.

ప్రశాంతంగా పది పరీక్షలు




సదుం: మండల పరిధిలోని సదుం జెడ్‌పి ఉన్నత పాఠశాలల పరీక్ష కేంద్రంలో 284 మందికి గాను 279 మంది విద్యార్థులు హాజరు అయినట్లు డిపార్ట్మెంట్ ఆఫీసర్ సూర్య ప్రకాష్ తెలిపారు. ఇద్దరు రెగ్యులర్ విద్యార్థులు, ముగ్గురు ప్రైవేట్ విద్యార్థులు గైర్హాజరైనట్టు తెలిపారు.

సోమల: మండలంలో మూడు పరీక్ష కేంద్రాలలో సోమవారం నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో 357 మందికి గాను 344 మంది విద్యార్థులు పరీక్షకు హాజరై ప్రశాంత వాతావరణంలో పరీక్షను రాశారని, 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు పరీక్ష నిర్వాహకులు తెలిపారు. పరీక్షలు కట్టుదిట్టమైన భద్రత మధ్య పరీక్షల నిర్వహించినట్లు ఎస్సై వెంకట నరసింహులు తెలిపారు.

బంగారుపాళ్యం: మండలంలోని నాలుగు సెంటర్లలో 827మందికిగాను 780 మంది విద్యార్థులు హాజరు కాగా 47 మంది గైర్హాజరైనట్టు మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. పరీక్షా కేంద్రాలను డివైఈవో తనిఖీ చేశారు.

నగరి: మండలంలో పదవ తరగతి పరీక్షలకు 1193 మందికిగాను 1190 మంది హాజరుకాగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజర్యారు. ప్రతి సెంటర్ వద్ద పోలీసులు, వైద్యసిబ్బంది, ప్రత్యేక స్క్వాడ్ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

ఈత కెళ్లి విద్యార్థి మృతి



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లి మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి సోమవారం ఈతకు వెళ్లి మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కమ్మనపల్లికి చెందిన గుడ్డూరు జయప్ప కుమారుడు మహేష్(15) సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కావడంతో బైరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పరీక్ష రాసి స్నేహితులతో ఇంటికి బయలుదేరాడు. ఇంటికి వెళ్లే దారిలో వ్యవసాయ బావిలో తనతోటి విద్యార్థులు ఈతకెళ్లడంతో మహేష్ వారితోపాటు బావిలోకి దిగాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు చుట్టుపక్కల విద్యార్థులు కేకలు వేయగా స్థానికులు బావిలో నుంచి మహేష్‌ను బయటకు తీసుకొచ్చేటప్పటికే విద్యార్థి మరణించాడు. పరీక్ష రాసి వస్తానని వెళ్లిన కొడుకు మరణించడంతో ఆ తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి. మహేష్ చాలా బాగా చదువుతాడని, తోటి విద్యార్థులుతో కలివిడిగా ఉంటాడని అటువంటి విద్యార్థి మృతి చెందడం బాధాకరమని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అనిత, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు

రాజకీయ పార్టీలు సహకరించాలి : కలెక్టర్



రాజకీయ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు -2024 షెడ్యూల్ ఈనెల 16న విడుదల కావడం జరిగిందని ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తు గానే నిర్వహణకు అవసరమైన అన్ని టీమ్‌లు ఏర్పాటు చేయడంతో విధులను నిర్వర్తించడం జరుగుతున్నదని కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్టాండింగ్ కమిటీ సమావేశం జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్యతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలై 48 గంటలు కావస్తున్నదని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల ప్రవర్తన నియమావళి జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తూ ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు బహిరంగ స్థలాలలో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్లు పోస్టర్లు అన్నింటిని తొలగించడం జరిగిందని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు 2024 సంబంధించి ఇదివరకే ఎంసిసి మానిటరింగ్ యూనిట్, ఎలక్టోరోల్, ఎపిక్ కార్డ్స్ మేనేజ్మెంట్ యూనిట్, పోలింగ్ స్టేషన్ మేనేజ్మెంట్ యూనిట్, ట్రైనింగ్ మేనేజ్మెంట్ యూనిట్, మెటీరియల్ ప్రొక్యూర్మెంట్ మేనేజ్మెంట్ యూనిట్, ట్రాన్స్పర్ అండ్ మేనేజ్మెంట్ యూనిట్ మానిటరింగ్ యూనిట్, స్వీప్ మేనేజ్మెంట్ యూనిట్ తదితర బృందాలు వారికి కేటాయించిన విధులను నిర్వర్తించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ బృందాలన్నీ జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో వారి విధులను నిర్వర్తించడం జరుగుతున్నదని తెలిపారు. ఇందుకు సంబంధించి ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అయిన బిఎస్‌పి పి.భాస్కర్, బిజెపి అట్లూరి శ్రీనివాసులు, సిపిఎం వాడ గంగరాజు, కాంగ్రెస్ పార్టీ పరదేశి, టిడిపి సురేంద్ర కుమార్, వైయస్సార్సీపి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నోడల్ అధికారుల విధులపై అవగాహన: కలెక్టర్

నోడల్ ఆఫీసర్లుకు కేటాయించిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం డిఆర్‌డిఏ సమావేశం హాల్‌లో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, చిత్తూరు నియోజకవర్గం ఆర్‌ఓ పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ బి.పుల్లయ్యలతో కలసి 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసిన వివిధ రకాల నోడల్ ఆఫీసుర్లు వారి సహాయకసిబ్బంది ఎన్నికలలో నిర్వహించవలసిన బాధ్యతలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికలు నిర్వహణకు 24 వివిధ రకాల నోడల్ ఆఫీసుర్లు ఏర్పాటు చేయడం జరిగిందని సంబంధిత టిమ్స్‌కు సహాయక సిబ్బందిని కేటాయించడం జరిగిందని, టిమ్స్‌కు సంబందించిన నోడల్ ఆఫీసుర్లు కు కేటాయించిన విధుల నిర్వహణపై పూర్తి అవగాహన చేసుకొని పనిచేయాలన్నారు. ఈనెల 16 ఎన్నికల షెడ్యూల్ రావడంతో మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ ఆములలో ఉందన్నారు. నోడల్ అధికారులు, తమకు కేటాయించిన సిబ్బంది ఎన్నికలు ముగిసే వరకు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటూ విధులను సక్రమనగా నిర్వర్తించాలన్నారు. ప్రతి టీం నోడల్ అధికారి, వారి సహాయక సిబ్బంది ఎన్నికల నియమావళిని దృష్టిలో పెట్టుకొని విధులు నిర్వహించాలన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్‌లో వివిధ రకాల టిమ్స్ నోడల్ అధికారులు సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గ స్థాయిలో పని చేస్తున్న సంబంధిత టిమ్స్ అధికారులతో సమన్వయం చేసుకుని విధులు నిర్వహించాలన్నారు. రిపోర్ట్‌లు చేసి తయారీ ఆర్‌ఓల ద్వారా నిర్దేశిత సమయంలోగా జిల్లా ఎన్నికల అధికారికి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి పంపించాలన్నారు.

ఎన్నికల కోడ్ అమలుపై నిరంతర పర్యవేక్షణ



మున్సిపల్ పాఠశాలను తనిఖీ చేస్తున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలో ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఏఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలుపై కమిషనర్ సోమవారం నగరంలో విస్తృతంగా పర్యటించి తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ భవనాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్ లోపల ప్రాంగణాల్లో తనిఖీలు చేసి రాజకీయపరమైన పోస్టర్లు, బ్యానర్లను తొలగింపజేశారు. వివిధ పథకాలు, నేమ్ బోర్డులపై ఉన్న ముఖచిత్రాలపై తెలుపు స్టిక్కర్లు అతికించారు. శిలాఫలకాలను మూసి ఉంచారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణాలు, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలల్లో తాగునీటి ప్లాంట్ల వద్ద ఉన్న స్టిక్కర్లను తొలగింపజేశారు. ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. నగరంలో ఎక్కడా రాజకీయపరమైన పోస్టర్లు, బ్యానర్లు, స్టిక్కర్లు ఉండరాదని అధికారులను ఆదేశించారు. అనుమతులు లేకుండా ఎక్కడైనా వీటిని ఏర్పాటు చేస్తే తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలుపై వార్డుల్లో నిరంతరం నిఘా ఉంచాలని, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రామకృష్ణుడు, ఇన్చార్జి ఎంహెచ్ఓ చిన్నయ్య, సానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు, మేస్త్రిలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ ఆదర్శంగా ఉండాలి:జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికల నిర్వహణలో చిత్తూరు నియోజకవర్గం మిగిలిన నియోజకవర్గాలకు ఆదర్శంగా ఉండేలా అధికారులు పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, ఆర్‌ఓ పి.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో మున్సిపల్ కమిషనర్, ఏఆర్‌ఓ డాక్టర్ జె.అరుణ, డిఎస్పీ, లాఅండ్ ఆర్డర్ నోడల్ ఆఫీసర్ రాజగోపాల్ రెడ్డిలతో కలసి 172 చిత్తూరు నియోజకవర్గం పరిధిలోని ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, విఎస్‌టి, టిమ్స్ నోడల్ ఆఫీసుర్లు, వారి సహాయ సిబ్బంది ఎన్నికల్లో నిర్వహించవలసిన బాధ్యతల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికలలో భాగంగా చిత్తూరు నియోజకవర్గం మిగిలిన నియోజకవర్గాలకు ఆదర్శంగా ఉండేలా అన్నిరకాల టీమ్స్ అధికారులు వారి సహాయక సిబ్బంది అందరు సమన్వయ చేసుకొని చిత్తూరు నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈనెల 16 సాయంత్రం 3 గంటల నుండి మోడల్ కోడ్ ఆఫ్ కాంట్రాక్టు ఆములలోకి వచ్చిందని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఎన్నికల నియమావళి వందకు వంద శాతం పాటించి ఎన్నికల విధులు నిర్వహించాలని సంబంధిత నోడల్ అధికారులను ఆదేశించారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, విఎస్‌టి టిమ్స్ రోజు వారికి రిపోర్టులు రోజుకు రెండుసార్లు నియోజకవర్గం యంసిసి నోడల్ అధికారికి పంపించాలన్నారు. చిత్తూరు నియోజకవర్గం లా అండ్ ఆర్డర్‌కు సంబందించి డీఎస్పీతో సమన్వయం చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు నిర్వహిచే సమావేశాలు, ర్యాలీలు నిర్వహణకు సంబంధించి ముందుగానే డిఎస్పీ నుండి పర్మిషన్ పొందాలన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించి ప్రింటింగ్ ప్రెస్‌లో ప్రింటింగ్ చేస్తే సంబంధిత ప్రింటర్ పేరు, ఎన్ని కాపీలు వేసియున్నారుని పూర్తి వివరాల రిపోర్టును పంపించాలన్నారు. సమావేశంలో ఏఈఆర్‌ఓలు, టీమ్స్ నోడల్ ఆఫీసుర్లు, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుడే 'రా రాజు'

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: వినియోగదారుడు నిజమైన రారాజు అని సీసీఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అనంతశర్మ తెలిపారు. జాతీయ వినియోగదారుల సమాఖ్య ఆధ్వర్యంలో 17, 18 తేదీలలో చెన్నైలో జరిగిన జాతీయ సదస్సులో 'వినియోగదారుల ఉద్యమాన్ని భవిష్యత్ తరాలకు ఎలాంటి మార్గదర్శకాలు చేయాలి' అంశంపై జరిగిన సదస్సులో తిరుపతి జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ప్రచురించిన 'వినియోగదారుడే రారాజు' అనే గోడపత్రికను అనంతశర్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిసిఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ పి.రాజారెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు చక్రపాణి, శంకర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు, బ్యానర్లు తొలగించండి: జెసి



సమావేశంలో మాట్లాడుతున్న జెసి శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వార్డు సచివాలయ పరిధిలో రాజకీయపార్టీ నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు వెంటనే తొలగించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, చిత్తూరు నియోజకవర్గం ఆర్‌ఓ పి. శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో మున్సిపల్ కమిషనర్, ఏఆర్‌ఓ డాక్టర్ జె.అరుణతో కలిసి చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ సిబ్బందితో ఎన్నికల నిర్వహణలో చేయవలసినవి, చేయకూడని పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పట్టణ పరిధిలోని సచివాలయ సిబ్బంది మీ సచివాలయ పరిధిలోని రాజకీయ పార్టీల నాయకుల పోస్టర్లు బ్యానర్లు ఫ్లెక్సీలు కటౌట్స్ ఇప్పటికే తెలిగించడం జరిగిందని ఇంకా ఏమైనా ఉంటే పరిశీలించి తొలగించాలని, ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించి ఉంటే 24 గంటల్లో వాటిని తొలగించాలని వారికి నోటీసులు పంపించాలన్నారు. సచివాలయ పరిధిలోని ఆశ, అంగన్వాడీ వర్కర్లు, ఆర్‌పిలు, రేషన్ షాప్ డీలర్లు వీరందరూ కూడా ప్రభుత్వం నుండి ఆదాయం పొందుతున్నారని, ఈ సిబ్బంది ఎవరు కూడా రాజకీయ పార్టీ నాయకుల ప్రచారాలకు, సమావేశాలకు వెళ్లకూడదని తెలిపారు. అలాగే వాలంటీర్లు కూడా రాజకీయ పార్టీ నాయకుల వెంట ప్రచారాలకు సమావేశాలకు వెళ్లి కూడదన్న అంశాన్ని సచివాలయ పరిధిలో సమావేశం నిర్వహించి వారికి తెలియజేయాలన్నారు. ఎవరైన వెళ్ళితే సచివాలయ సెక్రటరీలు వారిని గుర్తించి ఫొటోల సహా వివరాలను సంబంధిత ఆర్‌ఓకు పంపించాలని ఆదేశించారు.

ఫ్లెక్సీలు స్వచ్ఛందంగా తొలగించండి: ఎంపీడీఓ

సోమల: ఎన్నికల కోడ్ అమలలో ఉన్న కారణంగా మండలంలోని అన్ని పంచాయతీలలో ప్రభుత్వ ప్రైవేట్ భవనాలకు విద్యుత్ స్తంభాలకు బస్సు సెంటర్‌లకు ఇతర ప్రాంతాలలో ఉన్న రాజకీయ నాయకుల ఫోటోలు ఫ్లెక్సీలు, హోర్డింగులను స్వచ్ఛందంగా ఆయా పార్టీలకు సంబంధించిన వారు తొలగించాలని ఎంపీడీవో నారాయణ కోరారు. సోమవారం మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించి రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను, కరపత్రాలను పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ద్వారా తొలగించారు. ఆయన వెంట ఈఓఆర్డి లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి జయశంకర్, సుధాకర్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్వీ జూ పార్కులో బెంగాల్ టైగర్ మృతి



ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో 2016లో జన్మించిన బెంగాల్ టైగర్ అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. 2016లో ఎస్వీ జూపార్కు లోనే జన్మించిన ఈ బెంగాల్ టైగర్ పుట్టుకతోనే గుడ్డిదిగా ఉండేదని, పలు పరీక్షల అనంతరం చికిత్స అందిస్తూ వచ్చామన్నారు. ఆదివారం రాత్రి బెంగాల్ టైగర్ శరీరం పూర్తిగా చికిత్సకు సహకరించక మృత్యువాత పడిందన్నారు. బెంగాల్ టైగర్ వయసు 7సంవత్సరాల ఆరు నెలలుగా ఉందన్నారు. స్థానిక ఎస్వీ యూనివర్సిటీలో బెంగాల్ టైగర్ కు పోస్ట్ మార్టం చేసినట్లు జూ అధికారులు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో టోకరా

పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఆరుగురి వద్ద రూ.15లక్షలకు పైగా వసూలు చేసి ఓ యువతి మోసం చేసిన సంఘటన సోమవారం శ్రీకాళహస్తిలో వెలుగు చూసింది. ఈ ఘటనపై బాధితులు శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి పట్టణం దక్షిణ కైలాసనగర్ ప్రాంతానికి చెందిన ఓ యువతి బెంగళూరుతో పాటు మరికొన్ని చోట్ల ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి పి.అనిత వద్ద రూ.2లక్షలు, సి.వివేక్ వద్ద రూ.3.10లక్షలు, ఎం.రజిత వద్ద రూ.1.10లక్షలు, కె.అనిల్ వద్ద రూ.1.15లక్షలు, ఇ.శారద వద్ద రూ.4లక్షలు, బి.గగన్ వద్ద రూ.1.5ల0లక్షలు, పి.దేవకి వద్ద రూ.1.30లక్షలు తీసుకుంది. వీరికి ఉద్యోగాలు వచ్చాయని నమ్మించి బెంగళూరుకు వెళ్లమంది. ఆ యువతి మాటలు విని వారు బెంగళూరుకు వెళ్లారు. అయితే అక్కడకు వెళ్లిన తరువాత అసలు విషయం తెలిసింది. ఆ యువతి చెప్పినట్లు బెంగళూరులో ఎవరూ ఉద్యోగం ఇవ్వకపోవడంతో మోసపోయామని వీరు గ్రహించారు. అక్కడ నుంచి ఆ యువతికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ చేసింది. ఆ తరువాత బాధితులు నేరుగా ఆ యువతి ఇంటికి వెళ్లారు. ఉద్యోగాల పేరుతో తమ వద్ద తీసుకున్న వాపసు ఇవ్వాలని డిమాండు చేశారు. డబ్బుకోసం తనపై ఒత్తిడి చేస్తే ఆత్మహత్య చేసుకుంటానని ఆ యువతి చెప్పడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ యువతి నుంచి తమకు డబ్బు ఇప్పించాలని వారు కోరుతున్నారు.

కాలువ పైనే రెండు అంతస్తుల భవనం

నిద్రావస్థలో టౌన్ ప్లానింగ్ అధికారులు



కాలువ పైనే రెండు అంతస్తుల నిర్మించిన భవనం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి నగరపాలక టౌన్‌ప్లానింగ్ అధికారులు కొన్ని సందర్భాల్లో కళ్ళు మూసుకుని ఉంటారన్న విమర్శలున్నాయి.. మరికొన్ని సందర్భాల్లో డబ్బులు కావాలంటే అక్రమ కట్టడాలు కూల్చకుండా వదిలేస్తారు. తిరుపతి టౌన్ ప్లానింగ్ విభాగంలో ఈ విధానం పరిపాటిగా మారింది. ప్లానింగ్ సిబ్బంది చేరడంతో టౌన్ ప్లానింగ్ విచ్చలవిడిగా అక్రమకట్టడాలను ప్రోత్సహించే వారి దగ్గర పెద్దఎత్తున నగదును తీసుకోవడం ఆనవాయితీగా మారింది. ఏసీబీ దాడులు చేసినా టౌన్ ప్లానింగ్ విభాగంలో తమను ఎవరు ఏమి చేసుకోలేరనేది ధీమాతో ఉంటున్నారు. నగర పాలక సంస్థ 43వ డివిజన్‌లోని దోబి ఘాట్ పక్కనే ఉన్న మురుగునీటి కాలవపైనే ఫిల్లర్లు వేసి మరీ రెండు అంతస్తుల భవనం నిర్మించేశారు. ఇంత జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు కళ్లు మూసుకున్నారో అర్థం కావడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మురుగు వెళ్లడానికి నిర్మించిన కాలువల్లో ఫిల్లర్లు వేసి మరీ భవనాలు కడుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ఆ వార్డు ప్రజలు అడుగుతున్నారు. వర్షాకాలంలో మురుగునీటి కాలవలు ఆక్రమణలు గురికావడంతో కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి, 43వ డివిజన్లో కాలువ పైనే ఇల్లు నిర్మించిన ఘనుడు ఎంతకు తెగించారో దీన్ని బట్టి అర్థమవుతుంది. నగరంలో కాలువలు కుచింకుపోవడానికి కారణం కబ్జాదారుల సంఖ్య పెరగడం, ఆక్రమ కట్టడాల నిర్మాణమే. తిరుపతి నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ శాఖను ఎందుకు ఏర్పాటు చేశారో తెలీడం లేదు కానీ, లంచాలు ఇస్తే కాలువను కూడా పూడ్చి భవనాలు నిర్మిస్తున్న సంఘటనలు తిరుపతి నగరంలో కోకో కొల్లాలుగా ఉన్నాయి. కమిషనర్ స్పందించి ఈ కట్టడంపై చర్యలు తీసుకోకపోతే వర్షాకాలంలో వర్షపు నీరు ఉధృతిలో ఈ భవనం కూలిపోతే ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాల్సిన అవసరం ఉంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు తొత్తుగా వ్యవహరిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులను వెంటనే బదిలీ చేయాలని లేదంటే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇలాగే ఉంటే తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పక్కనే ఉన్న కాలువను కూడా ఆక్రమించి భవనం నిర్మించేస్తారు ఏమో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి..

కాలువను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి: సిపిఎం

మురుగునీటి కాలువను ఆక్రమించి కాలువలోనే ఫిల్లర్లు వేసి ఇళ్లు కటిని భవన యజమానిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కబ్జాలు మితిమీరిపోతున్నాయని, కాలువల సైతం వదిలిపెట్టడం లేదని అన్నారు. నగరంలోని 43వ డివిజన్ పరిధిలో ధోబి ఘాట్ పక్కన ఉన్న పెద్దకాలువపై ఇల్లు నిర్మాణం చేసుకొని కాపురం ఉంటున్న మున్సిపల్ అధికారుల కనబడడం లేదా అని ప్రశ్నించారు. మున్సిపాలిటీకి చెందిన స్థలంలో ఒక అడుగు స్థలాన్ని ఎవరు ఆక్రమించినా వారిపై చర్యలు తీసుకునే మున్సిపల్ యంత్రాంగం రెవెన్యూ అధికారులు నేడు మాల్వాడి గుండం నుండి నీరు వచ్చేటటువంటి అతిపెద్ద కాలువ ఆక్రమణకు గురై భవనం ఏర్పాటు చేసుకుని ఆఇంటిలో కాపురం ఉంటుంటే అధికారులకు ఎందుకు పట్టించుకోవడం లేదో చెప్పాలన్నారు. ఇదంతా చూస్తుంటే అధికారులు కూడా మామూలు మత్తులో పడిపోయి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. భారీ వర్షాలు వచ్చేటప్పుడు ఆ కాలవకుండానే కపిలతీర్థం జలపాతం నుండి నీరు దిగువకు వెళ్ళబడుతుంది. అటువంటి కాలువలను సైతం కాపాడులేని పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులు ఉన్నారంటే మీరు ఏ గుడ్డి గుర్రానికి పళ్ళు తోముతున్నారని ఎద్దేవా చేశారు. మున్సిపల్ అధికారులు రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సిపిఎం పెద్ద ఎత్తున ఆందోళన హెచ్చరించారు.

కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్


వెంకటేష్‌ను అభినందిస్తున్న పలువురు నాయకులు

ప్రజాశక్తి-యాదమరి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పూతలపట్టు నియోజకవర్గం కోడిగుట్టకు చెందిన వెంకటేష్ నియమితులైయ్యారు. ఈ మేరకు సోమవారం నియామక ప్రతాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించిన ఏపీపీసీసీ అధ్యక్షులు షర్మిల, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు సోకే శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు వెంకటేష్‌ను అభినందించారు.

డాక్టర్ మురళీకుమార్ సేవలు అభినందనీయం: ఎంపీపీ


డాక్టర్ మురళిని సన్మానిస్తున్న ఎంపీపీ

ప్రజాశక్తి-కార్వేటినగరం: డాక్టర్ మురళీకుమార్ సేవలు అభినందనీయం అని ఎంపీపీ లత అన్నారు. కార్వేటినగరం సీహెచ్‌సీ ఆసుపత్రిలో పని చేస్తున్న సివిల్ సర్జన్ డాక్టర్ మురళీకుమార్ ఉద్యోగోన్నతిపై శ్రీకాళహస్తికి బదిలీ అయ్యారు. కాగా ఈయనకు సోమవారం ఆసుపత్రిలో ఎంపీపీ లత, వైద్యాధికారులు శాలువలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆసుపత్రిలో అత్యుత్తమ సేవలందించిన డాక్టర్‌కు ఉద్యోగోన్నతి లభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైద్యసిబ్బందికి మార్గదర్శకంగా ఉంటూ రోగులతో స్నేహ భావంతో మెలుగుతూ వైద్య సేవలు అందిస్తూ వచ్చిన డాక్టర్ మురళీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ యూసఫ్, డాక్టర్ కీర్తి, డాక్టర్ భువనేశ్వరీ, డాక్టర్ శృతిభాగ్యం, పర్యవేక్షకులు అంబరీషీరాజు, వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అన్నీ అక్రమాలే..

- తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్‌కుమార్ ఆరోపణ



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ఉద్యోగ కల్పనా కేంద్రంగా కాకుండా ప్రస్తుత అధికార పార్టీకి రాజకీయ పునరావాస కేంద్రంగా మారిపోయిందని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్‌కుమార్ ఆరోపించారు. సోమవారం ఆయన చిత్తూరు టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాము అధికారంలో ఉన్న సమయంలో ఏపీపీఎస్సీ ద్వారా 162 గ్రూప్-1, గ్రూప్-2 పోస్టుల భర్తీ కోసం, అప్పటి ప్రభుత్వం 27/2018తో నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. తదనంతరం వైసీపీ ప్రభుత్వం అక్రమంగా నియమించుకున్న ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్, కార్యదర్శి పిఎస్ రామాంజనేయులు పోస్టుల భర్తీలో చేతివాటం ప్రదర్శించి, అనర్హులకు పోస్టింగులు ఇచ్చారని ఆరోపించారు. ఈ విషయంగా టిడిపి ఇదివరకే హైకోర్టులో కేసు దాఖలు చేసిందన్నారు. అయితే సంబంధిత కేసు కోర్టులో నడుస్తుండగానే ఏపీపీఎస్సీ ద్వారా దొడ్డిదారిన ఉద్యోగాలు పొందిన అధికారులను నేడు ఎన్నికల విధులకు నియమించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నియమ, నిబంధనలకు విరుద్ధంగా సీఎం జగన్ రెడ్డి పథకం ప్రకారం తన సమీప బంధువులను ఏపీపీఎస్సీ బోర్డు సభ్యులుగా నియమించుకొని తనకు లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి స్పందించి సంబంధిత నోటిఫికేషన్‌లో ఎంపికైన అధికారుల వివరాలను రాష్ట్ర గవర్నర్‌కు నివేదించి, వారిని ఎన్నికల విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సురేంద్రకుమార్, సప్తగిరిప్రసాద్, కోదండయాదవ్, మోహన్‌రాజ్, రమేష్‌నాయుడు, సునీల్ చౌదరి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వారిపై దాడి హేయం

- మీడియా ఎదుట గురజాల ఆగ్రహం



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: వైసీపీ రౌడీ మూకల అంతు చూస్తామని టీడీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ అన్నారు. తమ పార్టీలో చేరిన వారిపై దాడి చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని మురకంబట్టుకు చెందిన నవీన్‌కుమార్ ఇటీవల టీడీపీలో చేరారు. సోమవారం మధ్యాహ్నం ఆయన దాడి జరిగింది. విషయం తెలుసుకున్న గురజాల జగన్‌మోహన్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నవీన్‌కుమార్‌ను పరామర్శించారు. జరిగిన సంఘటనకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మురకంబట్టుకు చెందిన వైసీపీ నాయకులు చిన్ని అనుచరులు నవీన్‌కుమార్‌పై దాడి చేశారని, టీడీపీలో చేరుతున్న యువకులనే టార్గెట్ చేసుకొని దాడులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. 100మంది తమ పార్టీలో చేరారన్న అక్కసుతో దాదాగిరి చేయడం తగదన్నారు. దాడి సంఘటనపై ఎస్పీ దృష్టికి తీసుకెళుతున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, బాలాజీనాయుడు, చంద్రప్రకాష్, కటారి హేమలత తదితరులు ఉన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం మీడియాకు వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ అందిన రహస్య సమాచారం మేరకు పలమనేరు-కుప్పం జాతీయ రహదారిలోని దేవదొడ్డి క్రాస్ వద్ద ఎస్ఐ కృష్ణయ్య, సిబ్బంది వాహనాలు తనిఖీ చేశారన్నారు. కారులో మద్యం తరలిస్తున్నట్లు గుర్తించి ఇద్దరు నిందితులు చెన్నారెడ్డి, హసన్‌బాషాలను అరెస్ట్ చేశామన్నారు. కారు, అందులోని కర్నాటక నుంచి తీసుకొస్తున్న 1920 టెట్రా ప్యాకెట్లును సీజ్ చేశామన్నారు. ప్రెస్‌మీట్‌లో సీఐ కృష్ణమోహన్, ఎస్ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-సదుం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఎస్ఐకు ఘన సన్మానం


ఎస్ఐను సన్మానిస్తున్న పలువురు నాయకులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెదురుకుప్పం ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎస్ఆర్ పురం ఎస్ఐ రాజా కుళాయప్పలను పలువురు ఘనంగా సన్మానించారు. సోమవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ సంఘ అధ్యక్షులు గజేంద్ర, సభ్యులు కలిసి ఆయా స్టేషన్‌లలో ఎస్ఐలను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఢిల్లీ బాబు, చంద్రశేఖర్, శాంతి కుమార్, రాజేష్, గోవిందరాజులు, ప్రతాప్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ

నైపుణ్య శిక్షణకు విశేష స్పందన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు అపోలో మెడికల్ కాలేజీలో జరిగిన అంతర్జాతీయ నైపుణ్య శిక్షణ కార్యక్రమానికి విశేషణ స్పందన లభించింది. ప్రపంచ ప్రఖ్యాత గాంచిన డాక్టర్ మోసోబి నేతృత్వంలో యునైటెడ్ కింగ్డమ్‌లో పనిచేయాలనుకునే వైద్య, పారామెడికల్ విద్యార్థులకు ఆ దేశం నిర్వహించి పరీక్షకు ఎలా సిద్ధం అవ్వాలని అంశంపై సోమవారం జరిగిన మాస్టర్ క్లాసులో అంతర్జాతీయ నిపుణులు విద్యార్థులకు బోధన చేశారు.

పారిశ్రామికాభివృద్ధి తోడ్పతాం..: గురజాల

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: పారిశ్రామికాభివృద్ధికి తోడ్పతామని, వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ అన్నారు. సోమవారం నగరంలోని పారిశ్రామిక వాడలో పర్యటించారు. వ్యాపార సంస్థల యజమానులతో అక్కడే ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గంలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళతామని వచ్చే ఎన్నికల్లో తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏ.ఎస్.మనోహర్, బాలాజీనాయుడు, చంద్రప్రకాష్, కటారి హేమలత, నాయకులు చిట్టిబాబు, త్యాగరాజన్, వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్లు ఏర్పాటు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరులోని నిమ్మనపల్లి రోడ్డులో మరమ్మతులకు గురైన పైపు లైను పునరుద్ధరించినట్లు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ తెలిపారు. సర్పంచ్ బాషా మసూద్ ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు వివరించారు.

క్యాంపస్ సెలక్షన్‌లో 22మంది ఎంపిక



ప్రజాశక్తి-గంగవరం: మదర్ థెరిసా విద్యాసంస్థల్లో హైదరాబాద్‌కు చెందిన యద్వేధ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 22మంది ఎంపికైనట్లు కళాశాల కరెస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు చదువు పూర్తి అయిన వెంటనే నేరుగా ఉద్యోగాల్లో చేరుతున్నట్లు స్పష్టం చేశారు. ఏడాదికి రూ.4లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు లభించడం కళాశాలకు గర్వకారణం అన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ అధికారి రాజేంద్రరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయకులు వ్యూహాత్మకంగా

వ్యవహరించాలి: పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-సోమల: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ మరో సారి మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కార్యాచరణ రూపొందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అమాస మోహన్, ప్రభాకర్, వెంకటరమణ, రెడ్డప్ప, మసూద్, సర్వేశ్వరమ్మ, కళ్యాణి, హరినాథ్, వెంకటరమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీల వ్యతిరేక పార్టీ తెలుగుదేశం

- జిల్లా టిడిపి మాజీ ఉపాధ్యక్షులు రావూరి ఈశ్వరరావు ఆరోపణ



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: బీసీల వ్యతిరేక పార్టీ తెలుగుదేశం అని, ఆ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రావూరి ఈశ్వరరావు ఆరోపించారు. సోమవారం మధ్యాహ్నం చిత్తూరు నగరం గురునగర్ కాలనీలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అభివృద్ధికి తన సొంత నిధులను వెచ్చించి, తన వంతుగా అవిరామ కృషి చేశానని తెలిపారు. ఆ పార్టీలో బీసీలకు సముచిత స్థానం లేదని, కేవలం బీసీలను అనగదొక్కేందుకు మాత్రమే టీడీపీ ఉందన్నారు. అధినేత చంద్రబాబు తనను ఆహ్వానించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆదేశిస్తే శక్తి వంచన లేకుండా సేవలు చేశానని తెలిపారు. కానీ తగు ప్రాధాన్యత, అవకాశం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీకి రాజీనామా చేసి వైసీపీకి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. సమావేశంలో నగర మేయర్ ఆముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (చుడ) ఛైర్మన్ పురుషోత్తమరెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్, కార్పొరేటర్ జ్ఞానజగదీష్, చిత్తూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాహుల్ రాజారెడ్డి, చిత్తూరు టౌన్ బ్యాంక్ ఛైర్మన్ రామ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆందోళన



ప్రజాశక్తి-రామకుప్పం: ఇళ్ల స్థలాల మంజూరులో తీవ్ర అన్యాయం జరిగిందని రామకుప్పంకు చెందిన పలువురు మహిళలు ఆందోళనకు దిగారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజమైన లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులకు అనుకూలంగా ఉన్న వారికే డబ్బులు తీసుకొని స్థలాలు కేటాయించారని ఆరోపించారు. తాము ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల వద్దకు వెళ్లిన ఫలితం లేకపోయిందని వాపోయారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్ కుడా ఇల్లు లేనివారికి స్థలాలు మంజూరు చేయాలని ఆధికారులను ఆదేశించారన్నారు. ఇటీవల 30మందికి పైగా ఇంటి పట్టాలు పంపిణీ చేశారన్నారు. జాబితాలో చాలామంది అనర్హులు ఉన్నారని తెలిపారు. ఏళ్ల తరబడి అద్దె ఇంట్లో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన పేదలను గుర్తించి, అర్హులైన వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని అధికారులను కోరారు.

రైతులు ఫారం పాండ్‌లు తవ్వుకునేలా చూడాలి: డ్వామా పీడీ



ప్రజాశక్తి -ఏర్పేడు : రైతులు తమ పొలాల్లో ఫారం పాండ్‌లు తవ్వుకునేలా చూడాలని డ్వామా పీడీ సివి శ్రీనివాస ప్రసాద్ అధికారులకు సూచించారు. మండలంలోని మోదుగులపాలెం పంచాయతీలో నిర్వహిస్తున్న అమృత సరోవర్ పూడికతీత పనులను డ్వామా పీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ఈ వేసవిలో ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఉదయం 6 గంటలకు పని మొదలుపెట్టి కొలతల ప్రకారం పనిచేసి 10 గంటలకల్లా పని విడిచి పెట్టాలని, పని వద్ద తాగునీరు, నీడ వసతిని గ్రామంలోని ఏఎన్ఎం సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్స్, ప్రథమ చికిత్స బాక్సు వంటివి పని ప్రదేశంలో ఏర్పాటు చేయాలని సూచించారు. రైతుల బోర్లు, బావులలో నీరు పుష్కలంగా ఉండేందుకు రైతుల పొలాల్లో ఫారం పాండ్ లు తవ్వి వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కార్యక్రమాధికారి అవిలాల దేవరి, సిడిసిఎల్ ఆర్‌సి చంద్రశేఖర్ రాజు, జూనియర్ ఇంజనీర్ పాండజా బాలాజీ రావు, బిఎఫ్టి వెంకటాద్రి, మేట్ లక్ష్మీప్రసన్న, కూలీలు పాల్గొన్నారు.

వరుస చోరీలు..ప్రజలు బెంబేలు!

- పనిచేయని సిసి కెమెరాలు - నామమాత్రంగా పోలీసుల గస్తీ - పోలీసులకు సవాలు విసురుతున్న దొంగలు



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలో దొంగలు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. పోలీసుల నామమాత్ర గస్తీ కారణంగా దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. మరో వైపు సిసి కెమెరాలు పనిచేయక మూలన పడటంతో దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారుతోంది. దొంగతనాలు అదుపులోకి రాకపోవడంతో పట్టణ ప్రజలు రాత్రి వేళల్లో ఇళ్లలో నిద్రించాలన్నా, ఇల్లు విడిచి బయట దూర ప్రాంతాలకు వెళ్లాలన్నా భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున రెండు, మూడు గంటల ప్రాంతంలో దర్గా రోడ్‌లోని బంగారు దుకాణం, ప్రొవిజన్ స్టోర్ల షట్టర్లు పగలగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డ సంఘటన పట్టణ ప్రజలను భయాందోళన గురిచేస్తూ పోలీసులను అయోమయ స్థితిలో పడేసింది. రెండు రోజుల క్రితం తిరుమల ఆయిల్ దుకాణం షట్టర్ పగలగొట్టి నగదు దోచుకెళ్లారు. కొద్ది రోజుల క్రితం మూడు ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్ల డంతో పాటు ఓ పోలీస్ కానిస్టేబుల్ ఇంట్లో తాళాలు పగలగొట్టి మరీ దొంగ తనానికి పాల్పడ్డారు. పోలీసులుగస్తీని ముమ్మరం చేసి చోరీలను నివారించలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తు తు న్నాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సరిగా పనిచేయక పోవడానికి తోడు పోలీసు గస్తీ పూర్తిగా లేకపోవడం వల్లే వరస చోరీలు చోటు చేసు కుంటున్నాయని స్థానికులు భావిస్తున్నారు. రెండు రోజులకో సారి పట్టణంలో ఏదో ఒక ప్రాంతంలో దొంగతనాలకు పాల్పడుతుండడంతో ఏ రోజు ఏ ప్రాంతంలో దొంగతనాలు జరుగుతాయో ఎలాంటి దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందో అని పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటి కైనా పై స్థాయి అధికారులు మేల్కొని పట్టణంలో నాణ్యత గల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, చోరీలపై ప్రత్యేక నిఘా వేయడంతో పాటు పోలీసు గస్తీ పటిష్ఠంగా నిర్వహించి దొంగల బారి నుండి ప్రజలను కాపాడాల్సిన అవసరం అధికారులపై వుంది. పోలీసు యంత్రాంగం నిద్రావస్థనుండి మేల్కొని పట్టణంలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుని ప్రజల భయాన్ని తొలగించి రక్షణ కల్పించాల్సి వుంది.

ముగిసిన టిటిడి ఉద్యోగుల క్రీడాపోటీలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీలు సోమవారం ముగిశాయి. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాల మైదానంలో ఈ పోటీలు నిర్వహించారు. టీటీడీ సీనియర్ పురుష, మహిళ అధికారులకు వివిధ కేటగిరీల వారీగా నడక , బాల్ త్రో, బకెటింగ్ ది బాల్, షాట్ పుట్ తదితర పోటీలు నిర్వహించారు.

ఐఐటిలో వర్క్‌షాప్

ప్రజాశక్తి -ఏర్పేడు : ఐఐటి తిరుపతి సివిల్ అండ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ సిమెం టిషియస్ మెటీరి యల్స్ క్యారక్టె జేషన్, లేబరేటరీ టెస్టింగ్‌పై హై ఎండ్ వర్క్ షాప్‌ని ఐఐటి కాన్పూర్ నుండి ప్రొఫెసర్ సుధీర్ మిశ్రా, ఐఐటి తిరుపతి ప్రొఫెసర్ సురేష్ జైన్, ప్రొఫెసర్ అనిల్ కుమార్‌లతో సోమవా రం విజయవంతంగా ప్రారంభించారు. యక్సరేట్ విజ్ఞాన్ పథకం కింద సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్ స్పాన్సర్ చేసిన ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్ ఈ నెల 18వ తేదీ నుండి 24 వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

నిర్లక్ష్యం నిలువుటద్దం

- దుస్థితిలో ప్రభుత్వ యునాని వైద్యశాల
- పట్టించుకోని అధికారులు


దుస్థితిలో యునాని వైద్యశాల

ప్రజాశక్తి-వెదురుకుప్పం: అక్కడ ఎంతో మంది రోగులకు వైద్యం అందించారు. ఇప్పుడు అక్కడ చెదులు, పురుగులు స్థావరాలు ఏర్పరుకొన్నాయి. పట్టించుకొనే వారు లేక.. ప్రజలకు సేవలందక ఆ కేంద్రం దుస్థితి వర్ణనాతీతంగా ఉంది. మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆయుష్ విభాగం ప్రభుత్వ యునాని వైద్యశాల ఒకటుందనే విషయాన్ని అధికారులు మరచినట్లున్నారు. అందుకేనేమో పాడుపడ్డ భవనంలా దర్శనమిస్తోంది. గత కొంత కాలంగా అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో లేరు. సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ వైద్యశాలకు తాళం వేసి డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు చెబుతున్నారు. వైద్యశాలలోని విలువైన వస్తువులు, తలుపులు శిథిలావస్థకు చెరుకున్నాయి. ఆసుపత్రికి వచ్చిన స్థానికులు ఆ వైద్యశాల దుస్థితిని చూసి విస్తుపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. గతంలోలా వైద్య సేవలు పున:ప్రారంభించాలని ఆకాంక్షిస్తున్నారు.

రోగులకు అందుబాటులోకి తేవాలి..



పాడుబడ్డ ప్రభుత్వ యునాని వైద్యశాలను అందుబాటులోకి తీసుకురావాలి. అక్కడ మరమ్మతులు చేయించి సిబ్బందిని నియమించాలి.

మునికృష్ణారెడ్డి, పచ్చికాపల్లం

పాడుబడ్డ విషయాన్ని ఉన్నతాధికారులు చెప్పాం..



యునాని వైద్యశాల పాడుబడ్డ విషయాన్ని ఉన్నతాధికారులు తెలియజేశాం. కానీ ఆ వైద్యశాల మా కంట్రోల్‌లో లేదు.


డాక్టర్ సురేఖ, పచ్చికాపల్లం

భూ వివాదం పరిష్కారం



ప్రజాశక్తి-పలమనేరు: 14 ఏళ్లపాటు పెండింగ్‌లో ఉన్న కేసు ఎట్టకేలకు కుప్పం క్యాంప్ కోర్టులో పరిష్కారం అయినట్లు పలమనేరు సీనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ పి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో జడ్జ్ మాట్లాడుతూ కుప్పం క్యాంపు కోర్టు నందు జరిగిన రెండు రోజుల క్యాంపులో భాగంగా కుప్పంకు చెందిన ఇరు పార్టీలకు సంబంధించిన భూమి ఒక ఎకరా 30సెంట్లుకు సంబంధించి గత 14 ఏళ్ల క్రితం కోర్టును ఆశ్రయించారన్నారు. అప్పటినుండి కేసు జరుగుతూ ఉందన్నారు. ప్రస్తుతం ఆ భూమి విలువ సుమారు రూ.13కోట్లు ఉంటుందన్నారు. అయితే ఇరు పార్టీల కక్ష దారులు 14ఏళ్ల పాటు కోర్టును కేసు విషయంగా ఆశ్రయించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో భాగంగా ఇరువర్గాల వారిని సోమవారం కోర్టు నందు కౌన్సిలింగ్ ఇచ్చి నచ్చజేపటంతో ఎట్టకేలకు రాజీ కుదరడంతో కేసును పరిష్కరించామన్నారు. దీంతో ఇరు పార్టీలకు చెందిన భూ వివాదం కేసు త్వరతగతిన పరిష్కరించిన పలమనేర్ జడ్జ్ శ్రీనివాసులకు ఆ రెండు కుటుంబాలు అభినందనలను తెలిపి సంతోషం వ్యక్తం చేశారు.

పట్టాలిచ్చారు..హద్దులు చూపండి..



ప్రజాశక్తి -కోట : 'మాకు పట్టాలు ఇచ్చారు..కాని ఇప్పటి వరకు హద్దులు చూప లేదు..ఇప్పటికైనా స్పందించి హద్దు లు చూపండి..' అంటూ తహశీల్దారుకు చెందోడు గ్రామ ఎస్‌సి, ఎస్‌టిలు బిఎస్‌పి నాయకులతో కలిసి సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సోమవారం కోట మండలంలోని చెందోడుకి చెందిన ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన చింతల పూడి, సుశీలమ్మ, చింతలపూడి నాగమణి, మొగిలి గుంట బుజ్జమ్మ, గోను సుబ్బమ్మ, వాకాటి మార్తమ్మలు బీఎస్పీ నాయకులతో కలిసి కోట తహశీల్దారు నాగరాజు రావుకు వినతి పత్రం అందించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 82/1 సర్వే నెంబర్ లో 2.80 సెంట్లు భూమి ఉందని గుర్తు చేస్తూ తమకు 2010లో ప్రభుత్వం పట్టాలు ఇచ్చారని ఈ సమస్యపై గతంలో పలు మార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా పట్టించు కోలేదన్నారు. మా పొలాలు పక్కనే ఉన్న ఓ వ్యక్తి మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా తమ సమస్యకు పరిష్కా రం చూపాలని కోరారు. స్పందించిన తహశీల్దారు పరిశీలించి న్యాయం చేస్తా మని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.